
# యూనిట్ I

# 1. సమైక్యభారతి

– దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి

**ఆలోచించండి – మాట్లాడండి**



**ప్రశ్నలు:**

1. పై చిత్రంలో ఎవరెవరున్నారు? ఏమి చేస్తున్నారు?
2. మన జాతీయ జెండా ద్వారా ఏం గ్రహించాలనుకుంటున్నాము?
3. పిల్లలు ఒకరిభుజంపై మరొకరు చేతులు వేసుకున్నారు కదా! వారు ఏమనుకుంటుండవచ్చు? ఊహించండి.

**ఉద్దేశం:** కులమత భేదాలు వద్దని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.
ప్రస్తుత పాఠ్యభాగం "కృష్ణశాస్త్రిగారి గేయ సంపుటి" లోనిది.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాల గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలుసుకోండి.





నారాయణ నారాయణ అల్లా అల్లా
మాపాలిట తండ్రీ నీ పిల్లల మేమెల్లా ॥నారా॥

మతమన్నది నా కంటికి మసకైతే
మతమన్నది నా మనసుకు మబ్బైతే
మతం వద్దు గితం వద్దు
మాయా మర్మం వద్దు ॥నారా॥





ద్వేషాలు రోషాలు తెచ్చేదే మతమైతే
కలహాలు కక్షలు కలిగించేదే గతమైతే
మతం వద్దు గతం వద్దు
మారణహోమం వద్దు ॥నారా॥

మతమన్నది గాంధీజీ హితమైతే
మతమన్నది లోకానికి హితమైతే
హిందువులం ముస్లిములం
అందరం మానవులం
అందరం సోదరులం ॥నారా॥

**కవిపరిచయం:**



1. పేరు : దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి
2. కాలం : 1897 – 1980
3. జన్మస్థలం : తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం దగ్గర చంద్రంపాలెం
4. రచనలు : కృష్ణపక్షం, ఊర్వశి, సాహిత్య వ్యాసాలు, సినీగేయాలు
5. బిరుదు : కళాప్రపూర్ణ, పద్మభూషణ్

**భావం**

శ్రీమన్నారాయణుడైనా అల్లా అయినా మన పాలిట దైవమే. మన మందరం ఆయన పిల్లలం. మతం అనేది నా కంటికి మసక లాంటిదైతే, అది నా మనస్సుకు మబ్బు లాంటిదయితే ఆ మతం గితం నాకు వద్దు. ఆ మాయామర్మం అసలే వద్దు. మతం మన మధ్య పగ, కోపతాపాలను తెస్తే, గతం మన మధ్య కొట్లాటలు, కక్షలను కలిగిస్తే అలాంటి మతం వద్దు, గతం వద్దు. హత్యాకాండలు అసలే వద్దు. మహాత్మా గాంధీ గారు ప్రబోధించే మత సమానత్వమే ప్రపంచానికి మేలుచేస్తుంది. హిందువులు, ముస్లిములు అందరూ మనుషులే. అందరూ సోదరభావంతో నడుచుకోవాలి.



## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం




1. ఈ గేయం దేన్ని గురించి చెబుతుంది?
2. గేయం విన్నారు కదా! దీంట్లో దేశభక్తికి సంబంధించిన విషయాలు ఏమేమి ఉన్నాయి?
3. 'సమైక్యభారతి' గేయాన్ని రాగయుక్తంగా పాడండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. పాఠం చదవండి "అల్లా, మేమెల్లా" వంటి ప్రాసపదాలను గుర్తించండి. వాటిని రాయండి.
2. కింది వాక్యాలు చదవండి. వీటికి సంబంధించిన పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి. వాటి కింద గీత గీయండి.



అ) గతం మనలో కలహాలు కక్షలను కలిగిస్తుంది.
ఆ) హిందూ ముస్లింలందరూ అన్నదమ్ములే.
ఇ) మతం అనేది నా మనస్సుకు మబ్బులాంటిది.
ఈ) హత్యాకాండలు అసలే వద్దు.
ఉ) మతం ద్వేషాలు, రోషాలను కోరకూడదు. కలహాలు, కక్షలకు కారణంకాకూడదు.

3. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

అ) మతానికి అతీతంగా ఉంటానని పాఠంద్వారా తెలిపాడు కదా! పాఠంలోని ఆ వాక్యాన్ని రాయండి.
ఆ) మతం వద్దు, గతం వద్దు అని కవి ఎందుకన్నాడు?
ఇ) పాఠానికి సరిపోయే శీర్షికలను సూచించండి.
ఈ) హిందూ ముస్లింలు ఎలా మెలగాలి?

### III. స్వీయరచన



1. ఈ కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో జవాబులు రాయండి.

అ) ప్రపంచదేశాలు మనదేశ సంస్కృతి సంప్రదాయాలను ఎందుకు ప్రశంసిస్తాయి?
ఆ) "అందరం మానవులం, అందరం సోదరులం" దీన్ని సమర్థిస్తూ రాయండి.
ఇ) "మతం వద్దు, గితం వద్దు మాయామర్మం వద్దు" అని కవి అనడంలో ఆంతర్యమేమిటి?



©SCERT not to be republished

**2.** **కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) మనది భిన్నత్వంలో ఏకత్వం సాధించిన దేశం కదా! మరి మతసమైక్యత అవసరమేమిటి?

## IV. పదజాలం



**1.** **కింది పదాలు ఒకే వాక్యంలో వచ్చేట్లు రాయండి.**

వేషం – భాష; పాడి–పంటలు; మానవులం – సోదరులం; శాంతి – క్రాంతి; సంస్కృతి – సంప్రదాయాలు; వేదాలు – పురాణాలు; కులం – మతం.

ఉదా: కులం – మతం

కులమెందుకు మతమెందుకు మనమంతా మానవులం.

**2.** **కింది వాక్యాలను వ్యతిరేకార్థం ఇచ్చే వాక్యాలుగా మార్చి రాయండి.**

అ) వర్షాభావంతో రైతులు బాధనుండి విముక్తులుకాలేదు.

ఆ) సభకు రావల్సిన ముఖ్యఅతిథి ఇంకా చేరుకోలేదు.

ఇ) ధనికులకు దానం ఇవ్వండి.



**3.** **కింది వాక్యాలలో గీత గీసిన పదాల స్థానంలో సమాన అర్థం కలిగిన పదాలను వాడి మరిన్ని వాక్యాలను రాయండి.**

అ) మనమందరం ధరిత్రీ గోళాన్ని కాపాడుకోవాలి.

ఆ) మనదేశ ప్రజలలో సమభావన నెలకొనాలి.

ఇ) భారతావనిలో కలహాలను నివారించాలి.

ఈ) బ్రిటిషువారు మనదేశ సంపదను అపహరించుకొని పోయారు.

**4.** **కింది పదాలకు సరియైన అర్థాన్నిచ్చే పదాన్ని ఎంపిక చేయండి.**

అ) హితం ( )

ఎ) రోషం బి) ద్వేషం సి) మంచి డి) చెడు

ఆ) లోకం ( )

ఎ) మానవుడు బి) పొగడ్త సి) మతం డి) ప్రపంచం

## V. సృజనాత్మకత



**కింది వాటిలో ఒక దాన్ని చేయండి.**

అ) "సమైక్య భారతి" గేయాన్ని అందరు కలిసి తరగతిలో అభినయిస్తూ పాడండి.

ఆ) మనదేశంలాగే మనం పుట్టిన ఊరుకూడ కన్న తల్లివంటిది. మీ ఊరిని పొగుడుతూ ఒక గేయం రాయండి.



## VI. ప్రశంస



**కింది వాటిలో ఏదైనా ఒకటి చేయండి.**

అ) గేయంలో మీకు నచ్చిన పదాలను, పాదాలను గురించి రాయండి. అవి మీకు ఎందుకు నచ్చాయో తెలపండి.

ఆ) ప్రపంచంలోనే మనదేశపు సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకస్థానం ఉందికదా! ఎందుకో తెలపండి.

ఇ) గేయాన్ని మీ తరగతిలో ఎవరు బాగా అభినయించారు? బాగా ఉందని మీరు ఎందుకు అనుకుంటున్నారో చెప్పండి.

## VII. భాషాంశాలు



**1.** **కింది వాక్యాల్లో గీత గీసిన పదాలు ఏ భాషా భాగాలో గుర్తించి రాయండి.**

అ) హిమాలయాలు భారతదేశపు ఉత్తరసరిహద్దు.

ఆ) సరోజని పాట బాగా పాడింది. ఆమె ఈ గ్రామంలోనే ఉంది.

ఇ) వర్షంవల్ల మురుగు నీరు తొలగింది.


ఈ) తెల్ల పావురాలు శాంతికి గుర్తులు. అవి ఎంతో ముద్దొస్తాయి.

ఉ) రాము పరుగెత్తాడు.

ఊ) రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్రచేశాడు.

**2.** **కింది వాక్యాలను చదవండి.**

కింది వాక్యాలు చదవండి. వీటిలో ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం వచ్చే పదం ఏది? దేనిని, ఎవరిని అనే ప్రశ్నకు సమాధానం వచ్చే పదం ఏది? పనిని తెలిపే పదం ఏది?



(అ) రాణి సౌందర్యను కలుసుకున్నది.
1 2 3

(ఆ) మేము తెలుగు చదువుతున్నాం.
1 2 3

(ఇ) రహీం ఖురాన్ చదువుతున్నాడు.
1 2 3

వాక్యాలలోని 1వ పదం రాణి, రహీం, మేము అనే పదాలు 'ఎవరు' అనే ప్రశ్నకు సమాధానంగా వస్తుంది. దీన్నే 'కర్త' అంటారు.

వాక్యాలలోని 2వ పదం దేన్ని, ఎవరిని సూచిస్తుంది. దీన్నే 'కర్మ' అంటారు.

వాక్యాలలోని 3వ పదం పనిని సూచిస్తుంది. దీన్నే 'క్రియ' అంటారు.

ఇలా కర్త, కర్మ, క్రియ అనే క్రమంలో వాక్యాలు ఉంటాయి.

**3.** **కింది వాక్యాల్లో గీతగీసిన పదాలు కర్త, కర్మ, క్రియల్లో వేటికి చెందుతాయో గుర్తించి రాయండి.**

అ) సోము పరీక్ష రాశాడు. ______ ______

ఆ) విమల అన్నం తిన్నది. ______ ______




ఇ) యాస్మిన్ పాట పాడింది. ______ ______

ఈ) మీరంతా ఇళ్ళకు వెళ్ళండి. ______ ______

ఉ) మహాత్ములు పేదలను చేరదీశారు. ______ ______

**4.** **ఈ కింది గీతగీసిన పదాలను గమనించండి.**



అక్కడ బంతాట ఆడుతున్నారు.

అయ్యో! బంతి పోయిందా!

ఓహో! సినిమా ఎంత బాగుందో!

ఎలా? జరిగింది?

ఆహా! ఈగాలి ఎంత చల్లగా ఉంది!

పైన గీత గీసిన పదాలు గమనించారుకదా! అవి ఏ లింగానికి, ఏ వచనానికి, ఏ విభక్తికి సంబంధించినవి కావు కదా! ఇలా లింగవచనవిభక్తులు కానివాటిని అవ్యయాలు అంటారు.

★ **ఈ కింది అవ్యయాలు గమనించండి. వాటిని వాక్యంలో ఉపయోగించండి.**

అక్కడ, ఇక్కడ, ఎక్కడ, ఔరా! భళీ, అయ్యారే.

★ **మీకు తెలిసిన అవ్యయాలను రాయండి.**

## ప్రాజెక్టు పని

**కింది వాటిలో ఏదైనా ఒకటి చేయండి.**

అ) భరతమాతను స్తుతించే గేయాలను సేకరించండి.

ఆ) వార్తాపత్రికలు,పాఠశాల గ్రంథాలయంలో లభ్యమయ్యే దేశభక్తి గేయాలను సేకరించండి. వాటిని చార్టు మీద రాసి, మీ పాఠశాల గోడపత్రికలో ప్రదర్శించండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. | గేయ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను. రాయగలను. | ఔను / కాదు |
| 3. | గేయంలోని ప్రాస పదాలను గుర్తించగలను. | ఔను / కాదు |
| 4. | ఊరిని పొగడుతూ గేయం రాయగలను. | ఔను / కాదు |

*"అవసరమైతే దేశం కోసం*
*ధన, ప్రాణ త్యాగాలకైనా సిద్ధపడటమే దేశభక్తి"*



© SCERT not to be republished